సురేష్ నోరు తెరుచుకుపోయింది.

"అక్కడికక్కడే చచ్చిపోయాడు" అంది చిలుక.

ఆమె మళ్ళీ చిలుకను ముద్దు పెట్టుకుంది.

అతను తేరుకునేసరికి ఆమె గదిలో లేదు.

*  *  *  *

ఆమె వెళ్ళిపోయిన తర్వాత కొద్దిసేపటివరకూ చలనంలేకుండా గది మధ్యలో నిలబడి వుండిపోయాడతను. హఠాత్తుగా తలుపు తెరుచుకుంది మళ్ళీ.

రాక్షసుడిలాంటి ఆకారం లోపలికొచ్చింది. ఆరడుగులకన్నా ఎక్కువే ఎత్తుంటాడు. వెయిట్ లిఫ్టర్‌లా పొంగిన ఛాతీ, తిరిగిన కండరాలు, కనుబొమలు రెండూ కలిసిపోయి అతని ముఖం అత్యంత భయంకరంగా కనబడుతోంది.

లావు ముక్కు, ఎర్రటి కళ్ళూ, సన్నని పెదాలు తను చూసిన ఓ ఇంగ్లీషు సినిమాలో గొరిల్లా గుర్తుకొచ్చింది సురేష్‌కి. అతని విషపూరితమయినట్లున్న చూపు సురేష్‌ని చీల్చి చెండాడుతున్నట్లుంది. ఏదో మాట్లాడాలనుకున్నాడు సురేష్. కానీ గొంతు పెగలడంలేదు.

"భోజనానికేం కావాలో చెప్పండి! ఏర్పాటు చేస్తాను" అన్నాడతను.

సురేష్ కర్చీఫ్ తీసుకొని ముఖానికి పట్టిన చెమటలు తుడుచుకున్నాడు అతని ఆకారం తనను పూర్తిగా భయభ్రాంతుడిని చేసేసింది.

"ఏదోటి! ఏదయినా సరే" తన భయం బయటకు కనబడకుండా చెప్పాడు.

అతను నవ్వాడు. నిజానికది ఏ మాత్రం నవ్వులా లేదు. పెద్దపులి నవ్వితే ఎలా తెలుస్తుంది?

నాలుగడుగులు ముందుకువేసి సోఫాలో కూర్చున్నాడు. మళ్ళీ నవ్వాడతను. ఈసారి అతని తెల్లని పళ్ళు-వాటి మధ్యలో ఓ పెద్ద బంగారపు పన్ను కనిపించినయ్.

"ఈ ఆరునెలలూ మనిద్దరం కలసి గడపాలి బ్రదర్! అంచేత విరోధులుగా గడపడంకంటే స్నేహంగా గడపడం మంచిది ఏమంటారు?"

"అవునవును...." తడబడుతూ అన్నాడు సురేష్ .

"నాకు స్నేహమంటే చాలా ఇష్టం సురేష్ ! స్నేహం కోసం ప్రాణం ఇస్తాను. మనం స్నేహంగా వుండటం చాలా తేలిక. ఒకే ఒక్క సూత్రం ఫాలో అయితే చాలు! నేనేది చెప్తే మీరది ప్రశ్న వేయకుండా చేయటం. నేను రాత్రి పన్నెండింటికి మిమ్మల్ని నిద్ర లేపుతాను. కాఫీ తాగమని చెప్తాను. మీరు కాఫీ తాగాలి. వెంటనే ఐస్‌క్రీమ్ తినమంటాను. మీరు తినాలి. వెంటనే మళ్ళీ కాఫీ తాగమంటాను మీరు తాగాలి. అర్థమయిందనుకుంటాను."

"అయింది. రాత్రుళ్ళు కాఫీ తాగిన వెంటనే ఐస్‌క్రీమ్, ఐస్‌క్రీమ్ వెనుకే కాఫీ తాగాలి

అంతేగా?"

అతని తల వూగింది.

"ఖచ్చితంగా చెప్పారు. కాకపోతే కాఫీ స్థానంలో మరోటి, ఐస్‌క్రీమ్ స్థానంలో ఇంకోటి చెప్పవచ్చు. అవి తినుబండారాలు కాకపోవచ్చు మరేదయినా పని కావచ్చు. అంతే తేడా. ఇప్పుడు వివరంగా తెలిసిందనుకుంటాను".

"సెంట్ పర్సెంట్" అన్నాడు సురేష్.

"వెరీగుడ్! ఇంతకుముందు వినయ్ అనే అతనిక్కూడా ఇదంతా చెప్పాను. కానీ అతనికి అర్థం కాలేదు" చిరునవ్వుతో చూశాడతను. మనుషుల్ని తినే జాతివాళ్ళు అప్పుడే ఓ మనిషిని కనుక్కున్నట్లుంది అతని చూపు.

"అది వినయ్ దురదృష్టం" తిరిగి అన్నాడతను.

సురేష్‌కి మళ్ళీ చెమటలు పట్టసాగినయ్.

"అతనికి కారు యాక్సిడెంట్ అయిందని చెప్పారు" అన్నాడు తడారిపోయిన గొంతుతో.

"తప్పదు! ఆ మాత్రం అర్థం చేసుకోనివాళ్ళు ఏదోక రోజు కారు యాక్సిడెంట్‌కి బలి అవక తప్పదు"

సురేష్ ముఖం పాలిపోయింది. రాక్షసుడు అతనిని గమనించాడు.

"మీరు తేలిగ్గా అర్థం చేసుకున్నారు. కనుక మీకు కారు ప్రమాదం జరగదు" సురేష్ మాట్లాడలేదు. గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు.

ఆ రాక్షసుడి మాటల్లో హెచ్చరిక స్పష్టంగా అర్థమవుతోంది. వినయ్ అనేవాడు వాళ్ళు చెప్పినట్లు చేయడానికి నిరాకరించటం వల్ల మర్డర్ చేయబడ్డాడు. యాజ్ సింపుల్ యాజ్ దట్!

"మనం రేపు ఉదయం నుంచీ ఉద్యోగం ప్రారంభిద్దాం బ్రదర్! ఈ రోజంతా విశ్రాంతి తీసుకోండి! ఆ అల్మరాలో రకరకాల బుక్స్ వున్నాయ్. ఏ టు జెడ్! తీసుకోండి! అవసరమయితే ఆ కర్టెన్ పక్కకు లాగి అద్దాల్లోంచి చూడండి. అద్భుతమయిన సీనరీ- అన్నట్లు చెప్పటం మర్చిపోయాను. నాకు సీనరీ చూడటం కూడా చాలా ఇష్టం! మీకూ ఇష్టం అనుకుంటాను?".

"ఆ..అవును..."

"చూశారా! మనిద్దరికీ ఒకే విధమైన అభిరుచులున్నాయ్. మనం తప్పక్కుండా మంచి స్నేహితులమయ్యేందుకు అవకాశం వుంది. ఏమంటారు?"

"ఆ......అవును...?"

"వెరీ ఫైన్! ఇప్పుడు అద్భుతమైన భోజనం ఏర్పాటు చేస్తాను. బహూశా మీరింతకు ముందెప్పుడూ కనీవినీ ఎరుగని ఖరీదైన భోజనం"

అతను లేచి తలుపు దగ్గరకెళ్ళి తలుపు తెరచి వెనక్కు తిరిగి నవ్వాడు మళ్ళీ.

"ఏ మాత్రం అందోళనపడకు బ్రదర్! పూర్తిగా రిలాక్స్‌గా వుండటం హెల్త్‌కి మంచిదని డాక్టర్స్ చెప్తారు."

అతను నడిచి తలుపు మూసివేశాడు.

సురేష్ సోఫాలో కూలబడ్డాడు. తలంతా గిర్రున తిరుగుతున్నట్లుంది.

వినయ్‌ని కావాలనే చంపేశారా? ఆ విషయం ఆలోచించటానికే భయంగా వుంది. తను నిజంగానే చాలా పెద్ద ట్రాప్‌లో ఇరుక్కుపోయాడు. వీళ్ళు చెప్పినట్లు చేయకపోతే తనూ వినయ్‌లాగానే కారు యాక్సిడెంట్‌లో చంపబడతాడు.

తనిప్పుడు తప్పించుకోడానిక్కూడా వీల్లేదు. వాళ్ళ దగ్గర లక్ష రూపాయలు తీసుకున్నాడు. వాళ్ళు చెప్పినట్టల్లా చేయడానికి వప్పుకున్నాడు.

మళ్ళీ చెమటలు పట్టసాగినయ్ అతనికి. భోజనం అయ్యాక కొద్దిసేపు పచార్లు చేశాడు సురేష్. తన జన్మలో తినలేనంత అద్భుతమయిన వంట. తన కింతటి దశ పడుతుందని కలలో కూడా ఊహించలేదు.

అంతలోనే గుండె ఝల్లుమంది. ఇందులో ఏదో కాంప్లికేషన్ వుంది. లేకపోతే తనలాంటి వాడికంత డబ్బిచ్చి, అంత ఖరీదయిన ప్లాస్టిక్ సర్జరీ చేయించి....

తనెందుకు అర్జున్ అనే కోటీశ్వరుడిలా కనిపించాలి? అలా అనిపించడం వల్ల వాళ్ళకేమిటి లాభం? తననెందుకు ఈ గదిలో బంధించారు?

ఆ ఆలోచనకు ఉలిక్కిపడ్డాడు సురేష్.

తనను బధించారా? ఏమో! తనకు తెలీదు. ఎవరూ తనకలా చెప్పలేదు. అప్పటికప్పుడే ఆ విషయం తెలుసుకోవాలనుకున్నాడతను.

నెమ్మదిగా తలుపు దగ్గరి కొచ్చాడు. నెమ్మదిగా డోర్ నాబ్ మీద చేయి వుంచి తలుపు తెరిచాడు. సగం తెరుచుకోగానే తల బయటకు పెట్టబోయి ఎదురుగ్గా చిరునవ్వుతో, కౄరత్వంతో తనవంక చూస్తోన్న విష్ణుని చూసి నిశ్చేష్టుడయ్యాడు.

అతనిని తలుపు బయటే కాపలా వుంచుతారని తెలీదు.

"ఏం కావాలి మిస్టర్ సురేష్? ఎనీ ప్రాబ్లెమ్?" చిరునవ్వుతో అడిగాడతను.

"ఏమీలేదు. గదిలో బోర్‌కొట్టి"

"కొద్దిరోజులు భరించక తప్పదు. ఉద్యోగం అలాంటిది!"

సురేష్ తలుపు మూసుకుని లోపలికొచ్చేశాడు.

రాత్రి భోజనం చేస్తుండగా ఆ యువతి వచ్చింది మళ్ళీ. ఇప్పడామె డ్రస్ మారిపోయింది. అంతా నీలం. పల్చని బట్టలూ, జాకెట్టూ. చెప్పులూ. కనుబొమలూ, దుద్దులూ, గాజులూ.

"విష్ణు చెప్పాడు మిష్టర్ సురేష్ ! మీకు యిక్కడ బోర్‌గావుందని" అందామె నవ్వుతూ.

సురేష్ తడబడ్డాడు"ఆ ..అవును-అలా అనిపించింది!"

"విష్ణుతో చెప్పాను! మీకు బోర్ కలగకుండా చూడమని! మీకు వీడియో ఏర్పాటు చేస్తున్నాడతను. అఫ్‌కోర్స్! ఆ సినిమా చూడటం కూడా మీ ఉద్యోగంలో ఒక భాగమే. అది చూసి చాలా నేర్చుకోవాల్సి వుంది మీరు"

సురేష్ నిశ్శబ్దంగా వింటున్నాడు.

ఆమె లేచి నిలబడింది.

"ఇంకేమయినా ప్రాబ్లెమ్స్ వుంటే మనసులో దాచుకోకండి వెల్‌కమ్ టు రివీల్"

సురేష్ తలూపాడు.

ఆమె వెళ్ళిపోయింది. మరి కాసేపట్లో టి.వి. వి.సి .ఆర్. రెండూ ఓ నౌఖరు అతని గదిలోకి తీసుకొచ్చి వుంచాడు.

నౌఖరు వెళ్ళిపోగానే క్యాసెట్ ఆన్ చేశాడు విష్ణు.

"అర్జున్ గారు ఆఫీస్‌లో వుండగా ఈ క్యాసెట్ తీశాము ఫ్రెండ్! ఆయన మాట్లాడే పద్ధతి, ఆయన నడక, ఆయన నవ్వూ, ఆయన ఫోన్‌లో మాట్లాడే తీరు. అన్నీ మీరు జాగ్రత్తగా గమనించాలి. అవన్నీ రెండు రోజుల్లో ప్రాక్టీస్ చేయగలరనుకుంటాను. అఫ్‌కోర్స్! ఇది ఉద్యోగం! కనుక చేయక తప్పదు. అంత ఎక్కువ జీతం తీసుకుంటున్నప్పుడు."

వీడితో పిక్చర్ ప్రారంభమయింది.

ఓ వ్యక్తి లగ్జరియస్ ఆఫీస్‌లో కూర్చుని వున్నాడు. అతన్ని చూడగానే గుండెల్లో రైళ్ళు పరుగెత్తసాగినయ్. అచ్చం తన ముఖమే. ఏమీ తేడా లేదు. ప్లాస్టిక్ సర్జరీ పర్‌ఫెక్ట్‌గా చేశారు తనకు! ప్రక్కనే వున్న అద్దంవేపు అప్రయత్నంగా తిరిగింది అతని తల.

ఇద్దరూ కవల పిల్లల్లా కనబడుతున్నారు.

గంటన్నరసేపు నడిచిందా క్యాసెట్. ఆ గంటన్నరలో ఆఫీస్‌లో అతని కార్యక్రమం అంతా స్పష్టంగా తెలిసిపోయింది సురేష్‌కి.

వి.సి. ఆర్ ఆఫ్ చేశాడు విష్ణు.

"రేపట్నుంచి అర్జున్ సంతకం కూడా ప్రాక్టీస్ చేయాలి సురేష్! అంటే కంప్లీట్ రోజంతా బిజీ అయిపోతారు. ఇంక బోర్ అనేదే వుండదు. ఏమంటారు?"